ఘనంగా వజ్ర వారాహి నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్‌: వజ్ర వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భజన, హోమాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. శివరాంపల్లి ఎర్రబోడ, హైదర్‌గూడ, అత్తాపూర్‌, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్‌, బుద్వేల్‌, మైలార్‌దేవ్‌పల్లి, దుర్గానగర్‌ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో సందడిగా కనిపించాయి. తెల్లవారుజామున అభిషేకంతో అమ్మవారి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. వజ్ర వారాహి నవరాత్రుల్లో శుక్రవారం ప్రత్యేక స్థానం ఉంది. దీంతో అమ్మవార్లను ఉదయం ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం పెద్ద ఎత్తున స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం నిర్వహించిన భజన, మహా హారతి కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. బుద్వేల్‌లోని కోట మైసమ్మ ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సామూహికంగా మహిళలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

కోడి గుడ్ల కోసం క్యూ



రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ పీడీపీ చౌరస్తాలోని కోళ్ల పరిశోధన కేంద్రం వద్ద విక్రయిస్తున్న కోడి గుడ్లకు రోజురోజుకూ డిమాండ్‌ పెరుగుతుంది. 45 నిమిషాల పాటు ఈ కేంద్రం ద్వారా కోడిగుడ్లను విక్రయిస్తున్నారు. పరిశోధన కేంద్రంలోని కోడిగుడ్ల ద్వారా సేకరించిన ఈ గుడ్లకు మంచి డిమాండ్‌ ఉంది. తెల్లవారుజామున 6 గంటల నుంచే ఈ విక్రయ కేంద్రం వద్ద క్యూ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 10 నుంచి 50 మంది మాత్రమే కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం 200 మందికి పైగా ఈ కేంద్రం వద్ద క్యూ కడుతున్నారు.

విద్యుత్‌ వినియోగదారులకు మెరుగైన సేవలు



విద్యుత్‌ బిల్లింగ్‌ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌసర్‌

గోల్కొండ: విద్యుత్‌ వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందే విధంగా విద్యుత్‌ శాఖ అధికారులు కష్టపడి పని చేయలని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్‌ డివిజన్‌లోని హకీంపేట్‌ సాలార్‌ బ్రిడ్జీ వద్ద విద్యుత్‌ బిల్లు చెల్లింపులు, ఎఫ్‌టీసీ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌ సరఫరా, విద్యుత్‌ బిల్లుల చెల్లింపు తదితర విషయాలపై విద్యుత్‌ వినియోగదారుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని విద్యుత్‌ శాఖ అధికారులకు సూచించారు. పలుమార్లు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం జరిగినప్పుడు విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించడానికి అధికారులు వెంటనే రంగంలోకి దిగానే ఆయన సూచించారు. అదే విధంగా అధిక బిల్లులు, పెండింగ్‌ విద్యుత్‌ బిల్లులపై కూడా విద్యుత్‌ వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉండి వారి ఫిర్యాదులు పరిష్కరించే విధంగా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌, విద్యుత్‌ డిఈ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏఈ యూసుఫ్‌బాబు తదితరులున్నారు.

అన్నపూర్ణాదేవికి పసుపుకొమ్ములతో అలంకారం



రాయదుర్గం: పసుపుకొమ్ములతో అన్నపూర్ణాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక అలంకారం చేశారు. వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 21 కిలోల పసుపు కొమ్ములను దండలుగా అల్లి అమ్మవారికి అలంకరించారు. అంతకుముందు ఆలయంలో అమ్మవారితో పాటు, షిర్డీసాయిబాబా, గణపతి, కాశీ విశ్వేశ్వరస్వామి, ధన్వంతరిస్వామి, ఆంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాలు ఆలయ మేనేజింగ్‌ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోహిత్‌ (ఫైల్‌)

లంగర్‌హౌస్‌: దిచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతిచెందిన ఘటన లంగర్‌హౌస్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రీతి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగుడ మాజీ సర్పంచ్‌ సునీత రాజ్‌కుమార్‌లకు ఒక కుమార్తె, ఒక కుమారుడు రోహిత్‌(26). రోహిత్‌ చదువులు పూర్తి చేసుకొని మొయినాబాద్‌లో బట్టల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం రాత్రి తన వ్యాపారం ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. రాత్రి 11.30గంటలకు టిప్పుఖాన్‌ బ్రిడ్జి వద్దకు చేరుకున్న రోహిత్‌కు నీటిలో గుంతలు కనిపించక, ఆ గుంతలో వాహనం వెళ్లడంతో అదుపు తప్పి పడిపోయాడు. అతని తల రోడ్డుకు తగిలి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం లంగర్‌హౌస్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆయన మృతిచెందాడు. శనివారం పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

చేతిలో ఇమిడేనా..?



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులు, నాయకులు

- ఒక పార్టీలో రెండు పార్టీల నాయకులు
- గ్రూపు రాజకీయాలకు ఆస్కారం
- గుర్రుగా పాత కాంగ్రెస్‌ నాయకులు
- రంగులు మారనున్న రాజకీయం

మణికొండ: ఆ రెండు పార్టీలకు వార్డు స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పటిష్ట కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికలకు పోటాపోటీగా పని చేశారు. రాబోయే రోజుల్లో తమకు మంచి భవిష్యత్‌ ఉంటుందని వారంతా రాత్రి, పగలు తేడా లేకుండా ఎవరి పార్టీకి వారు పనిచేశారు. ఇంకా ఎన్నికల రాజకీయ వాసన పోకముందే గత ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ శుక్రవారం రాత్రి ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. దీంతో రాజేంద్రనగర్‌ నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ఇప్పటి వరకు అధికార, ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న వారంతా ఒకే అధికార పార్టీలో కలిసి పనిచేయాల్సి రావటం, వారందరికీ పెద్దదిక్కుగా, స్థానిక ఎమ్మెల్యేగా ప్రకాశ్‌గౌడ్‌ మారనున్నారు. దీంతో రెండు వర్గాలు ఒకే చేతిలో ఇమిడి పనిచేస్తారా..? లేక గ్రూపులు కట్టి ఎవరివర్గం వారిదే అన్నట్టుగా వ్యవహరిస్తారా అనే విషయం నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతుంది. కాంగ్రెస్‌ పార్టీలో గత దశాబ్దకాలంగా పార్టీ అభివృద్ధికి, దాని మనుగడకు ఎంతో కృషి చేసిన నాయకులు ఉన్నారు. నియోజకవర్గ స్థాయిలో బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌, ముంగి జైపాల్‌రెడ్డి, కస్తూరి నరేందర్‌ ప్రధాన భూమిక పోషించారు. ఇక మున్సిపాలిటీలు, డివిజన్‌ల స్థాయిలో ఆ పార్టీ అధ్యక్షులతో పాటు కార్యవర్గ సభ్యులు కష్టపడ్డారు. కొత్తగా పార్టీలోకి ఎమ్మెల్యేతో పాటు బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు, క్యాడర్‌ రావటంతో వారి పరిస్థితి వర్ణణాతీతంగా మారింది.

ఆశలు అడియాశలేనా..?

కాంగ్రెస్‌ పార్టీలో దశాబ్దాలుగా పనిచేస్తున్న వారు రాబోయే మున్సిపల్‌ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అనుకుని రాజకీయం చేశారు. తీరా ఇపుడు వారు ఆశిస్తున్న వార్డులోనే తమకు పోటీగా మరో నాయకుడు తమ పార్టీలోకే రావటంతో వారికి దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గతంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ టీడీపీ నుంచి టీఆర్‌ఎస్‌ పార్టీలో చేరిన సందర్భంలో ఆ పార్టీకి అంత బలం లేక పోవటంతో టీడీపీ నుంచి వచ్చిన నాయకులు సునాయాసంగా సర్దుకున్నారు. అదే కాంగ్రెస్‌ పార్టీలో ప్రతి వార్డు పరిధిలో గత మున్సిపల్‌ ఎన్నికల్లో పోటీ చేసిన నాయకులు ఉండటం, ఇపుడు అదే వార్డులో గెలిచి, ఓడిన నాయకులు వారికి పోటీకి రావటంతో వారు అయోమయంలో పడిపోయారు. ఒకవేల మున్సిపాలిటీలు యదాలాపంగా మరోసారి ఉంటే తమ పరిస్థితి ఏమిటని వారు మదనపడుతున్నారు.

తిరిగి కలవాల్సిందేనా..

రాజేంద్రనగర్‌ నియోజకవర్గంలోని నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్‌ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలు నడిపి ముందుగానే కొందరు కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. దీంతో బండ్లగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌, నార్సింగి మున్సిపాలిటీల మేయర్‌, చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసాలు పెట్టి వారిని గద్దె దింపి మరీ తమ పంతం నెగ్గించుకున్నారు. అంతా తమకు అనుకూలంగా ఉందనుకుంటున్న తరుణంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ సైతం వచ్చి వారు చేరిన కాంగ్రెస్‌ పార్టీలోనే చేరటంతో వారి పరిస్థితి కక్కలేక, మింగలేక అన్న చందంగా మారింది. రాబోయే రోజుల్లో వారంతా తిరిగి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ ఆధ్వర్యంలో కలిసి పనిచేయాల్సిన అవసరం రానుందని పలువురు చర్చించుకుంటున్నారు.

బీఆర్‌ఎస్‌కు బీటలు..

రాజేంద్రనగర్‌ నియోజకవర్గంలో ఇప్పటి వరకు పటిష్ఠంగా ఉన్న బీఆర్‌ఎస్‌ పార్టీకి పూర్తి స్థాయిలో బీటలు పారే పరిస్థితి కనిపిస్తుంది. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ వెంట ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, క్యాడర్‌ మొత్తం కాంగ్రెస్‌ పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో రాబోయే రోజుల్లో ఆ పార్టీకి రాష్ట్రం సాధించిన కొత్తలో తెలంగాణ వాదులు మాత్రమే మిగిలే అవకాశం ఎక్కువగా ఉండే సంకేతాలు కనిపిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్‌ గూటికి బీఆర్‌ఎస్‌ కీలక నేతలు



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీల చేరిన శంషాబాద్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సుష్మ

శంషాబాద్‌: మారుతున్న రాజకీయ సమీకరణాల్లో శంషాబాద్‌ మున్సిపాలిటీలో కారు దాదాపుగా ఖాళీ అయ్యింది. శుక్రవారం రాత్రి రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ చేరికతో పాటు ఆయన అనుచరగణమంతా ఆయన మాటే శిరోధార్యం అన్నట్లుగా హస్తం గూటికి చేరారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సుష్మ, వైఎస్‌ చైర్మన్‌ బండిగోపాల్‌, మాజీ జెడ్పీటీసీ తన్వీ, వైఎస్‌ ఎంపీపీతో పాటు పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు కౌన్సిలర్లు కాంగ్రెస్‌ గూటికి చేరారు. బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు డి.వెంకటేష్‌గౌడ్‌ కూడా కాంగ్రెస్‌కు జై కొట్టారు..

కీలక నేత సైతం..

శంషాబాద్‌లో సర్పంచ్‌గా పనిచేసిన ఆర్‌.గణేష్‌ గుప్తా స్థానికంగా రాజకీయాల్లో కీలకన నేతగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి రాజేంద్రనగర్‌ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి తన గురువైన ప్రస్తుత ఎమ్మెల్యే చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏఐఎఫ్‌బీ పార్టీ నుంచి తన అనుచర గణాన్ని మున్సిపాలిటీలో ఎన్నికల్లో దింపి 8 వార్డులను చేజిక్కించుకున్నాడు. తదనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో ఆయన కూడా తిరిగి బీఆర్‌ఎస్‌ గూటికే చేరుకున్నారు. తాజాగా ఎమ్మెల్యేతో పాటు మాజీ సర్పంచ్‌ ఆర్‌. గణేష్‌ గుప్తా కూడా కాంగ్రెస్‌ కండువా కప్పుకున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తెలుగు దేశంలో పార్టీలో ఉన్న సందర్భంగా ఆయనకు సన్నిహిత సంబంధాలు కూడా ఉన్నాయి. దీంతో పార్టీ మార్పు ఆయనతో పాటు ఆయన అనుచరగణానికి కూడా అనివార్యంగా మారింది.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



శంషాబాద్‌ రూరల్‌: పాల్మాకులలో ఉన్న మోడల్‌ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం వెరిజాన్‌ కంపెనీ ప్రతినిధులు బ్యాగులు, స్టేషనరీ అందజేశారు. ఈ కంపెనీ ఆధ్వర్యంలో పాఠశాలలో ఐసీటీ కంప్యూటర్‌ ల్యాబ్‌, సైన్స్‌ ల్యాబ్‌, స్మార్ట్‌ క్లాస్‌ రూంలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్‌ విష్ణుప్రియ తెలిపారు. వీటి నిర్వహణ, పర్యవేక్షణ కోసం కంపెనీ ప్రతినిధులు పాఠశాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రొగ్రాం మేనేజర్‌ వి.కరుణాకర్‌, తదితరులు పాల్గొన్నారు.

నారాయణమ్మ కళాశాలతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం నారాయణమ్మ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ సైన్స్‌తో పలు రంగాలలో కలిసి పనిచేసేందుకు అవగాహన ఒప్పందాలు శుక్రవారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చేసుకున్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ రఘురామిరెడ్డి, నారాయణమ్మ ఇనిస్టిట్యూట్‌ ప్రిన్సిపాల్‌ రమేష్‌రెడ్డి, అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఆధునిక టెక్నాలజీని వ్యవసాయ కార్యకపాలలో వినియోగించుకునేందుకు ఇరు సంస్థలు కలిసి పని చేయనున్నాయి. ఈ కార్యక్రమంలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ఎస్సీసెల్‌ మండల ఉపాధ్యక్షుడిగా జగన్‌



శంషాబాద్‌ రూరల్‌: కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ సెల్‌ మండల ఉపాధ్యక్షుడిగా సుల్తాన్‌పల్లి వాసి బి.జగన్‌ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు జి.శేఖర్‌ చేతుల మీదుగా శుక్రవారం నియామకపత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని జగన్‌ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు ఎం.రాజు, నాయకులు అశోక్‌, శేఖర్‌, మల్లేష్‌, సంజీవ, భిక్షపతి, జగదీష్‌, నవీన్‌, శ్రీకాంత్‌, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేడు సీబీఐటీలో గ్రాడ్యుయేషన్‌ డే

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో శనివారం 4వ గ్రాడ్యుయేషన్‌ డేను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సీవీ నరసింహులు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు పట్టాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఫెన్స్‌ రీసెర్చ్‌, డెవలప్‌మెంట్‌ లేబరేటరీ (డీఆర్‌డీఎల్‌) శాస్త్రవేత్తతో పాటు పలువురు అతిథులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

నెదర్లాండ్స్‌ యూనివర్సిటీలో పత్ర సమర్పణ



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ విద్యార్థిని నెదర్లాండ్స్‌లోని యుట్రెక్ట్‌ విశ్వవిద్యాలయంలో పత్రసమర్పణ చేశారు. హెచ్‌సీయూలోని సరోజినినాయుడు స్కూల్‌ ఆఫ్‌ ఆర్ట్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌లోని డ్యాన్స్‌ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని పి.బి.వైష్ణవి డాక్టోరల్‌ కన్సార్టియంలో 'ట్రేసింగ్‌ ది డైనమిక్స్‌ ఆఫ్‌ మూవ్‌మెంట్‌ : ఇన్‌సైట్స్‌ ఫ్రమ్‌ ఇండియన్‌ టెక్స్టువల్‌ సోర్సెస్‌' వ్యాసం సమర్పించారు. ఆమె హెచ్‌సీయూలోని ప్రొఫెసర్‌ జే అనురాధ పర్యవేక్షణలో పనిచేస్తున్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ రామాలయం నుంచి సాయంత్రం 4 గంటలకు కాలనీలోని పలు రోడ్ల ద్వార తిరిగి ఆలయానికి చేరుకునేలా జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని మణికొండ భక్తి వృక్ష సంస్థ వారు తెలిపారు. ఇస్కాన్‌ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

14న గోల్డెన్‌ టెంపుల్‌ నుంచి..

భక్తి కుటీర్‌ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు సెక్రటేరియట్‌ కాలనీలోని గోల్డెన్‌ టెంపుల్‌ నుంచి తుల్జారాంబాగ్‌ ఆలయం వరకు జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఇస్కాన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ రథయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని, సాయంత్రం తుల్జారాం ఆలయం వద్ద జరిగే ముగింపు ఉత్సవంలో ఇస్కాన్‌ సభ్యుడు రాధేశ్యామ్‌ దాస్‌ ఉపన్యాసం ఉంటుందన్నారు.

27న శంషాబాద్‌లో మాదిగ జేఏసీ బస్తీ బాట



మాదిగ జేఏసీ నాయకులతో పిడమర్తి రవి తదితరులు

శంషాబాద్‌: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ ఈ నెల 27న మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలో బస్తీ బాట నిర్వహించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ పిడమర్తి రవి తెలిపారు. శుక్రవారం స్థానికంగా మాదిగ జేఏసీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లపై కేంద్ర సర్కారు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్‌, గుంటి ప్రవీణ్‌కుమార్‌, పెద్దగండు సుభాష్‌, చిన్నగండు రాజేందర్‌, శ్రీధర్‌, రమేష్‌, మధు, శ్రావణ్‌, సురేష్‌ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



హిమాయత్‌సాగర్‌లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌ తదితరులు



కోకాపేటలో దోమల నివారణకు పిచికారీ చేయిస్తున్న వైస్‌ చైర్మన్‌ విజయ్‌బాబు

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌ సూచించారు. శుక్రవారం కార్పొరేషన్‌ పరిధిలోని పలు డివిజన్‌లలో ఫ్రై డే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హిమాయత్‌సాగర్‌ కార్పొరేటర్‌ ముద్దం రాము, భూపాల్‌గౌడ్‌, కమిషనర్‌ బి.శరత్‌చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ.. సీజనల్‌ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలన్నారు. డెంగీ, మలేరియా ప్రబలకుండా పరిశుభ్రంగా ఉండాలన్నారు.

ఇందిరమ్మ కాలనీలో..

బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ 18వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్‌ శ్రీలతసురేష్‌గౌడ్‌ హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. బిల్‌ కలెక్టర్‌ రాజశేఖర్‌, అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

డెంగీ, మలేరియా వంటి సీజనల్‌ వ్యాధులను నివారించేందుకు ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 15వ డివిజన్‌ శాంతినగర్‌ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. సందీప్‌ముదిరాజ్‌, దశరథ్‌, గౌస్‌ కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో..

మణికొండ: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నపుడే ఆరోగ్యంగా ఉంటారని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌, కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ జి.విజయ్‌బాబు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో వారు పర్యటించి మలేరియా, డెంగీ, కలరా వంటి వ్యాధుల నుంచి దూరంగా జీవించాలంటే మన చుట్టుపక్కల నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. శుక్రవారం అన్ని వార్డులలో దోమల నివారణకు పిచికారీ, ఆయిల్‌బాల్‌లు వేయటం, బ్లీచింగ్‌ ఫౌడర్‌ వేయటం చేయించారు. మున్సిపాలిటీ మాజీ చైర్మన్‌ డి.రేఖయాదగిరి, కౌన్సిలర్‌లు జి. శివారెడ్డి, లక్ష్మీప్రవళిక కిరణ్‌, కె.ఉషారాణి, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్‌, శానిటేషన్‌ ఇన్‌చార్జి లచ్చిరాం ల్గొన్నారు.

డ్రైడే-ఫ్రైడేపై విద్యార్థులకు అవగాహన..

రాజేంద్రనగర్‌: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి అనారోగ్యాలకు గురికామని కార్పొరేటర్‌ అర్చన జయప్రకాశ్‌, రాజేంద్రనగర్‌ సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్‌ రవి కుమార్‌ వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలను నిర్వహించారు. సర్కిల్‌ పరిధిలోని ఐదు డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి డీసీ రవికుమార్‌తో పాటు కార్పొరేటర్‌ అర్చన జయప్రకాశ్‌ హాజరయ్యారు.



కార్యక్రమంలో కార్పొరేటర్‌ అర్చన జయప్రకాశ్‌, డీసీ రవి కుమార్‌

పోచమ్మ ఆలయ ఆవరణలో హైమాస్ట్‌ లైట్ల ఏర్పాటు



హైమాస్ట్‌ లైట్లు బిగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: రాబోవు బోనాల పండుగను పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆలయాల ఆవరణలో హైమాస్ట్‌ లైట్లు ఏర్పాటులో భాగంగా వివిధ కాలనీలలో లైట్లను బిగించి వెలిగించారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని మధుబన్‌ కాలనీలోని పోచమ్మ ఆలయ ఆవరణలో రాత్రి సమయంలో చీకటి ఉండడంతో పలుమార్లు స్థానికులు కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్‌ చొరవ తీసుకొని పోచమ్మ ఆలయ ఆవరణలో హైమాస్ట్‌ లైటును ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. దీంతో సీనియర్‌ ఎలక్ట్రికల్‌ ఇంజినీర్‌ శ్రీకాంత్‌ జీహెచ్‌ఎంసీ సిబ్బంది రవీందర్‌తో పోచమ్మ ఆలయం ముందు లైట్లను బిగించారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు సత్కారం



రాయదుర్గం: రాయదుర్గం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఇటీవలి కాలంలో 9 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాజ్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కృష్ణగౌడ్‌ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు రాజేశ్వరి, కమలమ్మ, గంగ్యానాయక్‌, ఆంజనేయులు, అంబర్‌సింగ్‌, ఆనందం, ప్రశాంత్‌, పాండు, సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు.

నేడు, రేపు రామరాజ్య ప్రశాసన్‌ అయోధ్య జాతీయ రాజ్యసభ



రాచూరి రాజశేఖర్‌

అత్తాపూర్‌: రామరాజ్య ప్రశాసన్‌ అయోధ్య జాతీయ రాజ్యసభ జూలై 13, 14వ తేదీలలో రంగారెడ్డి జిల్లా నాగారం గ్రామంలో నిర్వహించనున్నామని రాచూరి రాజశేఖర్‌ అన్నారు. ఈ కార్యక్రమానికి భారత దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రముఖులు రానున్నారు. జాతీయ ముఖ్య ప్రశాసక్‌ భాస్కర్‌ సింగ్‌ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. అఖిల భారతీయ ప్రశాసక్‌ రాచూరి రాజశేఖర్‌ జాతీయ సంరక్షక్‌ వై. శ్రీధర్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రాచూరి రాజశేఖర్‌ మాట్లాడుతూ..జాతీయ ప్రశాసక్‌గా నియమించబడ్డాక మొదటి రాజ్యసభ తెలంగాణలో జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు.

'సండే ఈవినింగ్‌ టాక్‌'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్‌ టాక్‌' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'ఎంపవరింగ్‌ స్టోరీ ఆఫ్‌ జగదాంబ సరస్వతి' అనే అంశంపై మౌంట్‌ అబూకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సీనియర్‌ రాజయోగి బికె రాజుబాయ్‌ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040-23001234లో సంప్రదించవచ్చు.